మత్స్యకారులకు కొండంత అండ

- గంగపుత్రులకు మత్స్యకార భరోసా
- వేట నిషేధ భృతి రూ.10 వేలు చొప్పున 2611 మందికి ప్రతిపాదనలు
- ఎన్నికల కోడ్ ముగిశాక లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ

తొండంగి: మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఏటా సముద్రంలో వేట నిషేధ సమయంలో గంగపుత్రులకు అందించే భృతి రూ.10 వేలకు పెంచడంతో పాటు డిజీల్ సబ్సిడీ పెంచి వారి అభ్యున్నతికి కృషి చేస్తోంది. ఈ ఏడాది కూడా మత్స్యకార భరోసా సాయం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వరుసగా ఐదో ఏడాది కూడా నగదు జమకానుండటంతో మత్స్యకార కుటుంబాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

ఏప్రిల్ 14 నుంచి నిషేధం

సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధి కోసం ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ సమయంలో మత్స్యకారులకు జీవనోపాధి ఉండని కారణంగా వేట నిషేధ భృతిని అందిస్తోంది. తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో దాదాపుగా 10 వేల మందికి ఈ ప్రోత్సాహం అందుతోంది. ఎన్నికల కారణంగా నగదు జమ ఈ ఏడాది కాస్త ఆలస్యం కానుంది.

489 బోట్లకు రిజిస్ట్రేషన్

తొండంగి మండలంలోని అద్దరిపేట, పంపాదిపేట, కొత్తపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట, వాడ



దానవాయిపేటలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారుడు

ముసలయ్యపేట, ఎల్లయ్యపేట, దానవాయిపేట, నర్సిపేట, కొత్తపెరుమాళ్లపురం, పాతపెరుమాళ్లపురం, కొత్త చోడిపల్లిపేట గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని మత్స్యకారులంతా సముద్రంలో చేపల వేట ద్వారా జీవనం సాగిస్తుంటారు. మండలంలో మోటార్ బోట్లు 489 బోట్లు రిజిస్ట్రేషన్ కాగా అధికారులకు 482 దరఖాస్తులు అందాయి. వీటిని స్క్రూటినీ చేసి 477 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్టు తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆరుగురు మత్స్యకారులకు వేట చేసుకునేందుకు మత్స్యశాఖ నిబంధనల ప్రకారం అనుమతి ఉంది.

గతంలో ఇలా..

గతంలో 45 రోజుల మాత్రమే ఉన్న వేట నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం 61 రోజులకు పెంచింది. ఈ సమయంలో గత ప్రభుత్వాల హయాంలో 33 కిలోల బియ్యం మాత్రమే మత్స్యకారులకు అందించేవారు. అనంతరం రూ.రెండు వేలు, ఆ తర్వాత రూ.4 వేలకు పెంచి వేట నిషేధ కాలం ముగిసిన రెండు మూడు నెలల ఆ సొమ్ములు ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేట నిషేధ ప్రోత్సాహాన్ని రూ.10 వేలకు పెంచింది. వేట నిషేధం పూర్తికాక ముందే మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా సొమ్ములు జమ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వరుసగా ఐదో ఏడాది కూడా వేట నిషేధ ప్రోత్సాహాన్ని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు డీజిల్ రాయితీని రూ.6 నుంచి రూ.9కి పెంచి స్మార్ట్ కార్డుల ద్వారా తక్షణ ప్రయోజనం పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వరుసగా ఐదోసారి వేట నిషేధ భృతి రూ.10 చొప్పున అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2,611 మందికి ప్రతిపాదనలు



తొండంగి మండలంలో మత్స్యకార భరోసా పథకంలో ఈ ఏడాది 2611 మందికి వేట నిషేధ ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే వీరికి సంబంధించిన అప్లికేషన్లను ఆన్‌లైన్ చేశాం. త్వరలో ప్రభుత్వం మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తుంది. ఏటా క్రమం తప్పకుండా అర్హులైన మత్స్యకారులకు ప్రోత్సాహక నగదును అందించేందుకు కృషి చేస్తున్నాం.

– సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని

ఇబ్బందులు తప్పాయి



గతంలో వేట నిషేధ భృతి కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నేరుమా మా బ్యాంకు ఖాతాల్లోకి వేట నిషేధ భృతి నగదును జమ చేస్తోంది. ఈ విధానంతో మత్స్యకారులకు ఇబ్బందులు తప్పాయి.

– చొక్కా భాస్కరరావు, మత్స్యకారుడు, నర్సిపేటగ్రామం, తొండంగి మండలం.

వేట నిషేధ సమయంలోనే సొమ్ములు



రెండు నెలల పాటు వేట నిషేధ సమయంలో చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచడంతో పాటు క్రమం తప్పకుండా నిషేధ సమయంలోనే అందిస్తోంది. ఇది మాకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాం.

– ముత్తి కొండయ్య, మత్స్యకారుడు, కొత్తపేట గ్రామం, యర్రయ్యపేట పంచాయతీ

ఏటా క్రమం తప్పకుండా..



వేట నిషేధ సమయం రెండు నెలలకు పెంచాక ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నాలుగేళ్లుగా వేట నిషేధ సమయంలో అందించే భృతిని రూ.10 వేలకు పెంచి ఏటా క్రమం తప్పకుండా అందిస్తోంది. ఈ ఏడాది కూడా అందితే మాకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది.

– యజ్జల ఆనంద్, మత్స్యకారుడు, దానవాయిపేట, తొండంగి మండలం

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు, గోవింద మాలధారణ భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు అర్చకులు ఉత్సవాల ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం) నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలుత కలశాలతో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, పల్లకీ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 వరకూ నిర్వహిస్తున్నారు.

నేడు ప్రత్యేక పూజలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, గరుడ ప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, భేరిపూజ, దేవతాహ్వానం, వాహనసేవ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనంపై మెళకువలు నేర్పారు. అలాగే మజ్జి నాగేశ్వరరావు గణితంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తునట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కోటనందూరు: విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ నాగరత్నం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నాగలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు తప్పుదోవ పట్టకుండా వారి విజ్ఞానాన్ని పెంపొందించడమే వేసవి శిబిరాల లక్ష్యమన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, ఆటపాటల్లో తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు. వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు పోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.



ఏలేశ్వరం గ్రంథాలయంలో చిత్ర లేఖనంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు



కోటనందూరు గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న లైబ్రేరియన్ నాగరత్నం

జోరుగా మామిడి పండ్ల విక్రయాలు



ఏలేశ్వరంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడిపండ్లు

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేసవి కావడంతో మామిడిపండ్లు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లోని చిన్నపిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకూ వీటిని కొనుగోలు చేసి ఇష్టంగా తింటున్నారు. ఏలేశ్వరంలోని హనుమాన్ జంక్షన్, మార్కెట్ వీధి, ప్రధాన రహదారులను ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేశారు. మామిడి పండ్ల రకాలను బట్టి వాటి పరక (13 కాయలు) రూ.100 నుంచి రూ.250 వరకు అమ్ముతున్నారు. స్థానిక మార్కెట్ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయం, హనుమాన్ జంక్షన్, యర్రవరం రోడ్డులోని పాతబస్టాండ్, వినాయకుని గుడి ఎదురుగా మామిడి కాయలు విక్రయిస్తున్నారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

'పిఠాపురం' ఈవీఎంలకు పటిష్ట భద్రత

- స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతర నిఘా
- జేసీ రామసుందర్‌రెడ్డి



పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమును, నిఘా వ్యవస్థను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు సంబంధించి పిఠాపురం నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంల స్ట్రాంగ్ రూమును, నిఘా వ్యవస్థను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో గత 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిందన్నారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను ఇక్కడ భద్రపచడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పరిశీలించే విధంగా సీసీ కెమెరాలు అన్ని వైపులా కనిపించేలా ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు.

వర్షంతో ఆరుతడి పంటలకు ఊపిరి



వి.కొత్తూరులో సాగు చేస్తున్న ఆరుతడి పంటలు

తుని రూరల్: ఆవర్తన ఉపరితల ద్రోణి ప్రభావంతో కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలు ఆరుతడి పంటలకు ఊపిరి పోశాయి. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మెట్ట ప్రాంతమైన తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో ఉద్యాన, ఆరుతడి పంటలకు నీటి ఎద్దడి నెలకొంది. కొన్నిప్రాంతాల్లో నీరులేక పంటలు ఎండిపోయాయి. కాగా ఈ నెల 11 నుంచి అడపాదడపా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఉద్యాన పంటలైన కూరగాయలు, మామిడి, తదితర తోట పంటలకు, ఆరుగడిగా సాగయ్యే నువ్వులు, మొక్కజొన్న, మల్బరీ తదితర పంటలకు ప్రాణం పోసినట్టయ్యింది. వి.కొత్తూరు, తాళ్లూరు, ఎన్.చామవరం, మరువాడ, కుమ్మరిలోవ, తదితర గ్రామాలతో పాటు ఐదు మండలాల్లో 360 ఎకరాల్లో రైతులు కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. అకాల వర్షాలతో పంటలకు మేలు జరుగుతోందని వ్యవసాయధికారులు తెలిపారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తొండంగి: కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు గురువారం ఉదయం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మరికొద్ది రోజులు పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఇటుకల బట్టీలు, మామిడి తాండ్ర తయారీ కేంద్రాలు తాత్కాలికంగా మూత పడ్డాయి. గ్రామాల్లోని ఉపాధి పనులకు సైతం ఆటంకం కలుగుతోంది.

అవగాహనతో డెంగీని తరిమేద్దాం

- ఘనంగా జాతీయ డెంగీ నివారణ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

కోటనందూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగి మహమ్మారిని తరిమికొట్టాలని ఈవోపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా సమాజంతో కలవండి–డెంగీ వ్యాధిని నివారించండి పేరుతో గురువారం వైద్యారోగ్య, పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇండుగపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఈవోపీఆర్డీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాప్తి స్తోందన్నారు. డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన పెంచుకొని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు గురువారం డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా రాచపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి గీత మాట్లాడుతూ దోమలను లార్వా దశలోనే అంతం చేయాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆనంద్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇండుగపల్లిలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు



రాచపల్లిలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



కొత్తపల్లి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నిఖిత

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ

గండేపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమని గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ నరేష్ అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం గండేపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శర్మ, సూపర్‌వైజర్ ఎ.చెల్లారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాలి

గోకవరం: డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిత వైద్య సిబ్బందికి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిత మాట్లాడుతూ ప్రజలు డెంగీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధుల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే–ఫ్రైడేలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు మూర్తి, శంకర్, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ లీగల్: జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా న్యాయ సహాయం అందించడానికి మండల న్యాయసేవాధికార సంస్థలో పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ పరిధిలో 25 మందిని ఎంపిక చేస్తామని, వారికి ఏడాది కాలం సేవలు అందించాలన్నారు. దరఖాస్తుదారు విద్యార్హత పదో తరగతి, దానితో సరి సమానమైన అర్హత ఉండాలి, వయో పరిమితి 18 ఏళ్లు నిండి ఉండాలి. మౌఖిక ఇంటర్వ్యూను ఎదుర్కొనవలసి ఉంటుంది.

అర్హత గల గ్రూపులు

విశ్రాంత టీచర్లు, విశ్రాం ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, ఫిజీషియన్లు, న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సామాజిక సేవా సంస్థల్లో పనిచేస్తున్న ఎన్‌జీఓలు, పొరుగు మహిళ సంఘాల సభ్యులు, మైత్రి సంఘాల సభ్యులు, స్వయం సహాయక సేవా సంస్థల సభ్యులు, అట్టడుగున వున్నవారు వివిధ రకాల బాధితులు, గృహిణులు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు, సంస్థచే గుర్తించబడిన ఇతరులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు వచ్చే నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: తాండవ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణంలోని కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజీపేట, సీతారామపురం, కంకిపాటివారి గరువు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శంఖవరం మండలంలో...

శంఖవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని శంఖవరం, నెల్లిపూడి, కొంతంగి, గొంది కొత్తపల్లి, అచ్చంపేట, జగ్గంపేట, గౌరంపేట, మాసంపల్లి, పెద్ద మల్లాపురం, వేళంగి, అనుమర్తి తదితర గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి మండలంలో...

తొండంగి: అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని పైడికొండ, ఆనూరు జి.ఎం.పేట, అన్నయ్యపేట, కొత్తపేట, వేమవరం, అద్దరిపేట, యల్లయ్యపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గంగాలమ్మ ఆలయానికి రూ.10 వేల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాతలు

గోకవరం: గోకవరం శివారున ఉన్న గ్రామదేవత గంగాలమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన జనపరెడ్డి వరలక్ష్మి, ఆమె మనవడు శ్రీగణేష్ రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు అక్షింతల రాజా, నాగులకొండ బాబు, ఏనుగు శ్రీను, చిటికెల పాండు, సంగుల చక్రరావులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గంగాలమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు చెప్పారు. భక్తులు, దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు.

జగ్గంపేట చేరిన శివకరణ్‌సింగ్ పాదయాత్ర



జగ్గంపేటలో శివకరణ్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

జగ్గంపేట: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదరక్షలు లేకుండా ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకరణ్‌సింగ్ చేస్తున్న పాదయాత్ర గురువారం జగ్గంపేటకు చేరింది. శివకరణ్‌సింగ్‌కు జగ్గంపేటలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు వర్మ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివకరణ్‌సింగ్ మాట్లాడుతూ సనాతన సంస్కృతి అభివృద్ధే ధ్యేయంగా 2022 మార్చి 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పతేపూర్ జిల్లా ఖరౌలీ గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. యువతలో దేశభక్తిని పెంపొందించడం, అమరవీరులకు నివాళిగా మొక్కలు పెంచడం, యువతను మత్తు పదార్థాలకు దూరంలో ఉంచడమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. కన్యాకుమారి వరకూ యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సురేష్ శర్మ, భరత్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి గురువారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.